సాక్షి ప్రకాశం

గురువారం ၊ 11 ၊ ఏప్రిల్ ၊ 2024



కారుణ్య వర్షిణి రంజాన్

నెలవంక కనిపించడంతో ముస్లింలు రంజాన్ ఉపవాస దీక్షలను విరమించారు. గురువారం రంజాన్ పర్వదినాన్ని జరుపుకోనున్నారు.

- IIలో..



చెక్‌పోస్టుల్లో నిరంతర తనిఖీ

ఎన్నికల వేళ జిల్లాలో 16 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతర తనిఖీ చేపట్టామని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ తెలిపారు.

- IIలో..

గరిష్టం/కనిష్టం
35.3/27.6

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

ఒంగోలు: ధార్మిక చింతన, దాతృత్వం, క్రమశిక్షణల మేలు కలయిక పవిత్ర రంజాన్ మాసం అని, మానవాళి క్షేమాన్ని కోరుతూ నెలరోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు నిర్వహించిన ప్రతి ఒక్కరికీ రంజాన్ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, రీజినల్ కోఆర్డినేటర్, వైఎస్సార్‌సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మంత్రులు డాక్టర్ ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు వేర్వేరు ప్రకటనల్లో ఆకాంక్షించారు. కష్టాల్లో ఉన్నవారికి దానం చేసి ఆదుకునే సద్గుణాన్ని నేర్పుతుందని, నమాజులతో సక్రమ మార్గంలో పయనిస్తూ పవిత్ర ఆరాధనలో అల్లాను కోరుకోవాలని ముస్లిం సోదర సోదరీమణులకు విజ్ఞప్తి చేశారు.

12 నుంచి దివ్యాంగులకు ఉచిత నిర్ధారణ శిబిరాలు

ఒంగోలు: జిల్లాలోని మూడు సంవత్సరాల వయస్సు నుంచి 17 సంవత్సరాల లోపు వయస్సున్న దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు ఒంగోలు, మార్కాపురంలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఈ పంపిణీ జరుగుతుందన్నారు. ఒంగోలులోని డాన్‌బాస్కో స్కూలు, మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలల్లో పంపిణీకి చర్యలు తీసుకుంటారన్నారు. ఆయా డివిజన్ల పరిధిలోని మండలాల నుంచి ఉపకరణాలు అవసరమైన దివ్యాంగులు నిర్ణీత తేదీల్లో హాజరుకావాలన్నారు. ఈ నిర్ధారణ శిబిరానికి హాజరయ్యే దివ్యాంగ విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఉచిత భోజన వసతి, రవాణా భత్యం అందజేస్తారన్నారు. భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న రిసోర్సుపర్సన్లు, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు తప్పనిసరిగా వారి పరిధిలోని దివ్యాంగులను ఈ శిబిరానికి హాజరయ్యేలా చూడాలన్నారు.

నేడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి

ఒంగోలు: స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా, నగర అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, సుతారం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యే ఈ కార్యక్రమంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

టీడీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి రాజీనామా

బేస్తవారిపేట: బేస్తవారిపేటకు చెందిన టీడీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి దోమల వెంకటరమణ టీడీపీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. గిద్దలూరు నియోజకవర్గంలో టీడీపీ పుట్టినప్పటి నుంచి పార్టీలో ఉంటూ పార్టీ కోసం కష్టపడి పనిచేశానని, గతంలో సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు ఎంతో గౌరవం ఉండేదన్నారు. నేడు పట్టించుకునేవారు లేరని, పార్టీ పదవులకు గౌరవం, గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీలో ఉన్న సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఒకసారి ఆలోచన చేయాలని కోరారు.

సముద్ర జలాల్లో చేపల వేట నిషేధం

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాదేశిక సముద్ర జలాల్లో మత్స్యశాఖ కమిషన్ ఉత్తర్వుల మేరకు చేపల వేట నిషేధించినట్లు జిల్లా మత్స్యశాఖ జేడీఏ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల పాటు వివిధ చేప, రొయ్యల జాతుల సంతానోత్పత్తి కాలంలో తల్లి చేపలు, రొయ్యలను సంరక్షించటం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించటం ద్వారా సముద్ర మత్స్య సంపద సుస్థిరతను సాధించవచ్చని చెప్పారు. ఈ నిషేధ ఉత్తర్వులను అనుసరించి యాంత్రిక పడవలు, మోటారు బోర్లలో మత్స్యకారులు ఎటువంటి చేపల వేట చేయకుండా మత్స్య అభివృద్ధికి సహకరించాలని కోరారు. నిషేధాన్ని ఉల్లంఘించిన మత్స్యకారులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. వారికి అందించే ప్రోత్సాహక డీజిల్ రాయితీ, ప్రభుత్వం అందించే అన్ని రకాల రాయితీలను రద్దు చేయటమే కాక కఠిన శిక్ష ఉంటుందని తెలిపారు. నిషిద్ధ కాలంలో ఖచ్చితంగా అమలు చేసేందుకు మత్స్యశాఖ, కోస్ట్ గార్డ్, కోస్టర్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ, రెవిన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మత్స్యకారులు సహకరించాలని కోరారు.

నాడు కమ్మపాలెం... నేడు సమతా నగర్

టీడీపీ బరితెగింపు

పక్కా ప్లాన్ ప్రకారం వైఎస్సార్‌సీపీ ఇంటింటి ప్రచారాన్ని అడ్డుకున్న టీడీపీ నేతలు

- 2019 ఎన్నికల్లోనూ కమ్మపాలెంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయ ప్రారంభం అడ్డగింత
- అదే సీన్‌ను రిపీట్ చేసిన దామచర్ల అండ్‌కో..
- సమతా నగర్‌లో బాలినేని శ్రీ కావ్య ప్రచారాన్ని అడ్డుకున్న వైనం
- టీడీపీ నాయకులది ప్రతిసారీ రెచ్చగొట్టే రాజకీయం
- ఘర్షణకు కారణమైన టీడీపీ అభిమాని ఏఆర్ కానిస్టేబుల్ చప్పిడి లక్ష్మీ నారాయణ చౌదరి
- దామచర్ల జనార్దన్ రావటంతో ఉద్రిక్త వాతావరణం
- పరిస్థితిని అదుపులోకి తెచ్చిన పోలీసులు



బుధవారం అర్ధరాత్రి రిమ్స్ వద్ద బాలినేని శ్రీనివాసరెడ్డి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రతి ఎన్నికల్లోనూ టీడీపీది రెచ్చగొట్టే ధోరణే... ప్రత్యర్థి పార్టీని కవ్వింపు చర్యలకు ఉసిగొల్పడం ఆ పార్టీ నేతలకు సర్వసాధారణం. 2019 ఎన్నికల్లో కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ టీడీపీ నాయకులు చేపట్టిన హంగామా ఇప్పటికీ నగర ప్రజలు మరిచిపోలేదు. 2024 ఎన్నికలు వచ్చాయి కదా మళ్లీ ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీ కార్యక్రమాలను అడ్డుకోవటమే పనిగా పెట్టుకున్నారు. పక్కా ప్లాన్ ప్రకారం ఒంగోలు నగరంలోని సమతా నగర్‌లో ప్రశాంతంగా సాగుతున్న ఇంటింటి ప్రచారాన్ని దామచర్ల అండ్ కో అడ్డుకుంది. ఆ పార్టీ నాయకులు ప్రతిపక్షంలో ఉన్నా...అధికార పక్షంలో ఉన్నా వారి తీరు మారదనడానికి ఈ ఘటన ఉదాహరణ.

బాలినేని కోడలు ప్రచారాన్ని అడ్డుకున్న ఏఆర్ కానిస్టేబుల్...

ప్రశాంతంగా ఉన్న ఒంగోలు నగరంలో వైఎస్సార్ సీపీకి చెందిన వాళ్లు 37వ డివిజన్‌లో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి కోడలు శ్రీకావ్య సమతా నగర్ ఒకటో లైన్‌లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఐదేళ్లలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ ముందుకు వెళుతున్నారు. అదేలైన్‌లోని హిమశ్రీ నిలయం అపార్ట్‌మెంట్ లోపలకు తన అనుచరులతో కలిసి వెళ్లే ప్రయత్నం చేశారు. ఇంతలో ఆ అపార్ట్‌మెంట్‌లోనే అద్దెకు ఉంటున్న టీడీపీ అభిమాని, ఏఆర్ కానిస్టేబుల్ చప్పిడి లక్ష్మీ నారాయణ చౌదరి అపార్ట్‌మెంట్ లోపలకు వెళ్లకుండా ఆమెను అడ్డుకున్నారు. అడ్డుకోవటంతో పాటు అపార్ట్‌మెంట్ గేటుకు తాళం వేశాడు. అప్పటికీ శ్రీకావ్య ''మీ ఇంటికి రావద్దు అంటే రాకుండా ఉంటాము. అపార్ట్‌మెంట్‌లో మిగతా ఫ్లాట్లు ఉన్నాయి కదా వారి ఇళ్లకు వెళ్లి ప్రచారం చేసుకుంటాము'' అన్నా వినిపించుకోలేదు. ఇంతలోనే కానిస్టేబుల్ భార్య చప్పిడి ప్రభావతి అదే డివిజన్‌కు చెందిన టీడీపీ తరుపున కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓడిపోయిన మేడికొండ మోహన్ రావుకు ఫోన్ చేసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వచ్చి కొడుతున్నారని చెప్పింది. దీంతో హడావుడిగా మోహన్ రావు తన అనుచరులతో అక్కడకు చేరుకోవటంతో ప్రశాంతంగా ఉన్న వాతావరణం కాస్తా ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. రావటం రావటం అసత్య పదజాలంతో ఇష్టారాజ్యంగా తిట్టుకుంటూ అపార్ట్‌మెంట్ వద్దకు వచ్చి వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలపై దాడికి పూనుకున్నాడు. గొడవ జరగకుండానే కొడుతున్నారని ప్రభావతి చెప్పి టీడీపీ వాళ్లను మరింతగా రెచ్చగొట్టింది. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అపార్ట్‌మెంట్ దగ్గరికి చేరుకోగా..కోడలు శ్రీకావ్య గొడవ పెద్దది కాకూడదన్న ఉద్దేశంతో ఆయనకు సర్దిచెప్పి పంపించారు.

దామచర్లది ఎప్పుడూ రెచ్చగొట్టే ధోరణే...

టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్‌ది ఎప్పుడూ రెచ్చగొట్టే ధోరణే. అతను నాయకులకు, కార్యకర్తలకు కూడా ప్రత్యర్థి పార్టీ కేడర్‌పైకి ఉసిగొల్పటం పరిపాటే. సమతా నగర్‌లో అప్పటి వరకు ఉన్న చిన్నపాటి ఘర్షణ కాస్తా దామచర్ల రావటంతో పరిస్థితి చేయిదాటిపోయింది. రెండు, మూడొందల మందిని పిలిపించుకొని మరీ వైఎస్సార్‌సీపీ నాయకులు, కేడర్‌పై దాడికి ఉపక్రమించాడు. పోలీసులు నిలువరించినా నెట్టుకొని మరీ వైఎస్సార్‌సీపీ కేడర్‌పైకి దూకుడూ కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దీంతో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కార్యకర్తలు ఢీ అంటే ఢీ అని తలపడేందుకు సిద్ధమయ్యారు. టీడీపీ, వైఎస్సార్ సీపీ కార్యకర్తల తోపులాటలో ఇరువర్గాలకు చెందిన వారు గాయపడ్డారు. గర్భిణిగా ఉన్న మాజీ వలంటీరు సైతం గాయపడింది. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను రిమ్స్‌కు తరలించారు. అక్కడకు బాలినేని వెళ్లి వారిని పరామర్శించి ధైర్యం చెప్పి వచ్చారు. ఒంగోలు డీఎస్పీ కిషోర్ బాబు, తాలూకా సీఐ భక్తవత్సల రెడ్డితో పాటు నగరంలోని పోలీస్ బలగాలను సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు సంయమనం పాటించి పెద్ద ప్రమాదాన్ని నివారించారు.

ఎస్పీ కార్యాలయం ముందు హంగామా..

ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో లేడని తెలిసినా కావాలని దామచర్ల జనార్దన్ ఎస్పీ కార్యాలయం ముందు హడావుడి చేశాడు. ఎస్పీ బుధవారం యర్రగొండపాలెం, మార్కాపురం నియోజకవర్గాల్లో పర్యటించేందుకు ఉదయమే వెళ్లారు. ఎస్పీ కార్యాలయంలో లేడని తెలుసుకొని మరీ దామచర్ల తన అనుచరులను వెంటేసుకొని జిల్లా పోలీస్ కార్యాలయం వద్దకు వెళ్లి హంగామా సృష్టించాడు. ప్రధాన గేటు వద్ద రక్షణగా ఉన్న పోలీసులు ఎస్పీగారు ఇంకా రాలేదు, పశ్చిమ ప్రాంతానికి వెళ్లారని చెప్పినా ఇక్కడే భైఠాయిస్తామని మొండి వైఖరితో తన అనుచరులను గేటు ముందు కూర్చోబెట్టాడు. ఆ తరువాత ఎస్పీ వచ్చి దామచర్లను, ఇతర నాయకులను కొంతమందిని లోనికి పిలిపించుకొని వాళ్లతో మాట్లాడి సంఘటనకు సంబంధించి పూర్వాపరాలు తెప్పించుకుంటానని చెప్పి పంపించారు.



పోలీసుల ఎదుటే రెచ్చగొడుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ఆస్పత్రిలోనూ దామచర్ల బరితెగింపు

ఒంగోలు టౌన్: ఎన్నికల వేళ ఒంగోలు నగరంలో టీడీపీ నాయకుడు దామచర్ల జనార్దన్ బరితెగించాడు. పక్కా ప్లాన్ ప్రకారం సమతానగర్‌లో వైఎస్సార్ సీపీ ప్రచారాన్ని అడ్డుకొని ఉద్రిక్త వాతావరణం సృష్టించాడు. ప్రశాంతంగా ప్రచారం సాగుతున్న తరుణంలో దామచర్ల ఉద్రిక్త పరిస్థితులు సృష్టించాడు. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను సముదాయించారు. గొడవ సద్దుమణిగిందనుకుంటున్న అందరూ ఊపిరి పీల్చుకున్న సమయంలో దామచర్ల మరోసారి బరితెగించాడు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న టీడీపీ వారిని పరామర్శ పేరుతో.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ వారిని బెదిరించాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి జీజీహెచ్‌కు చేరుకున్నారు. అయితే లోపల దామచర్ల జనార్దన్ ఉండటంతో బాలినేనిని లోపలికి వెళ్లకుండా నచ్చజెప్పి బయట ఉంచారు. అదే సమయంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో జీజీహెచ్‌కు చేరుకున్నారు. ఆస్పత్రిలోనూ తమ వారిని బెదిరించిన జనార్దన్ తీరును బాలినేనితో పాటు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు జీజీహెచ్ వద్ద ఖండించారు. పోలీసులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. జనార్దన్‌ను ఆస్పత్రి నుంచి బయటకు పంపించేశారు. దీంతో ఉద్రిక్త వాతావరణం సద్దుమణిగింది.

కమ్మపాలెం ఘటన కూడా ఇంతే...

2019 సాధారణ ఎన్నికల్లో బాలినేని శ్రీనివాస రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తపట్నం సెంటర్‌కు సమీపంలోని కమ్మపాలెం వైఎస్సార్‌సీపీ డివిజన్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు ఇంటి వద్దనుంచి బయలుదేరారు. పార్టీ కార్యాలయం ప్రారంభానికి బాలినేని వస్తున్నారని తెలియటంతో అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న దామచర్ల జనార్దన్ కమ్మపాలెంలోని పార్టీ నాయకులను, కార్యకర్తలను రెచ్చగొట్టాడు. దాంతో బాలినేనిని కమ్మపాలెంలోకి వెళ్లనీయకుండా టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా రోడ్డులో భైఠాయించారు. బాలినేనిని పార్టీ కార్యాలయం ఓపెనింగ్‌కు పోకుండా రోడ్డును బ్లాక్ చేశారు. ఆరోజు ఉదయం 10 గంటలకు కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌కు చేరుకున్న బాలినేనిని సాయంత్రం 6 గంటల వరకు టీడీపీ కేడర్, కమ్మపాలెం వాస్తవ్యులు అడ్డుకున్నారు. అప్పట్లో ఒంగోలు-కొత్తపట్నం రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తపట్నం సెంటర్ పూర్తిగా స్తంభించిపోయింది. దాంతో ఒంగోలు బస్టాండ్ నుంచి అటు కొత్తపట్నంకు కానీ, టంగుటూరు, సింగరాయకొండ, కందుకూరు, కావలి, తిరపతితో పాటు ఆ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సుల రూటును ముంగమూరు రోడ్డు మీదుగా మళ్లించాల్సి వచ్చింది. మొత్తంగా ఆ రోజు పగలు 8 గంటల పాటు ఒంగోలు నగరం స్తంభించిపోయింది. జనాలు మాత్రం కమ్మపాలెం ఏమైనా పాకిస్థానా ..బాలినేనిని పార్టీ కార్యాలయం ఓపెనింగ్‌కు పోనీయకుండా అడ్డుకోవటానికి అని టీడీపీ నాయకులను చీదరించుకున్నారు.



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త

కార్పొరేటర్ చెన్నుపాటి టీడీపీలో చేరిన రోజే ఉద్రిక్తత...

వైఎస్సార్‌సీపీకి చెందిన 37వ డివిజన్ కార్పొరేటర్ బుధవారం పార్టీని వీడి టీడీపీలో చేరిన రోజే ఆయన డివిజన్‌లోని సమతా నగర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనటం పెద్ద చర్చనీయాంశంగా మారింది. వైఎస్సార్ సీపీ తరఫున 37వ డివిజన్ కార్పొరేటర్‌గా పోటీ చేసి గెలిచిన చెన్నుపాటి వేణు గోపాల్ చౌదరి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సమక్షంలో టీడీపీలో చేరాడు. కార్పొరేటర్‌గా ఉండి తన డివిజన్‌లో బాలినేని శ్రీనివాస రెడ్డి చేత భారీ స్థాయిలో నిధులు ఇప్పించుకొని మరీ అభివృద్ధి కార్యక్రమాలు చేయించుకున్నాడు చెన్నుపాటి. చివరకు అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడేసరికి వేణుగోపాల చౌదరి తన అనుచరులతో కలిసి టీడీపీలోకి వెళ్లాడు. ఆయన వెళ్లిన రోజే వైఎస్సార్ సీపీ కేడర్‌ను రెచ్చగొట్టే ధోరణిలోకి వెళ్లిపోయారు.

జనార్దన్ అడుగు పెడితే అరాచకమే

- పక్కా ప్లాన్ ప్రకారమే దాడి
- కాలు పెట్టిన చోటల్లా కమ్మపాలెం చేయాలనేదే తపన
- నాడు కమ్మపాలెం వద్ద నన్ను అగౌరవపరిచారు
- నేడు నా కోడలితోపాటు నాలుగు నెలల గర్భిణిపైనా దాడి
- దౌర్జన్యాలను సహించేది లేదంటూ బాలినేని హెచ్చరిక



ఒంగోలు: దామచర్ల జనార్దన్ అడుగుపెడితే అరాచకమే అని స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. స్థానిక సమతానగర్‌లో ఇంటింటి ప్రచారానికి వెళ్లిన తన కోడలిని, మహిళా నాయకురాళ్లను అపార్టుమెంట్‌లోకి రానీయకుండా అడ్డుకోవడం, మరో వైపు సెల్‌తో వీడియో తీయడం ఏమిటన్నారు. బుధవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. ఓటు మీ ఇష్టం...కానీ విజ్ఞప్తి చేసుకోవద్దని మీరు ఎలా అంటారంటూ అడిగిన నేరానికి వలంటీర్‌గా రాజీనామా చేసిన నాలుగు నెలల గర్భిణిపై దాడిచేసి కొట్టడం ఏమిటన్నారు. దీనిపై అడ్డం వెళ్లిన తన కుటుంబ సభ్యురాలిపై కూడా దారుణమైన పదజాలం వాడి జనాలను రెచ్చగొట్టారన్నారు. మరో వైపు విషయం తెలిసి తాను అక్కడకు వెళదామనుకుంటే తన కోడలు వద్దులే అంటూ పెద్ద మనస్సుతో నన్ను రావొద్దని సూచించారన్నారు. ఘటన అయిపోయిన తరువాత మోహన్ వచ్చి జనాలను రెచ్చగొట్టి జనాలను తిడుతుంటే కార్యకర్తలు ఎంతవరకు మౌనంగా ఉండగలరన్నారు. కేవలం రెచ్చగొట్టి ఏదో ఒక విధంగా అరాచకం సృష్టించడం, కులాల మధ్య చిచ్చుపెట్టడమే లక్ష్యంగా జనార్దన్ పనిచేస్తున్నారన్నారు.

కాలు పెట్టిన చోటల్లా కమ్మపాలెమేనా:

2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు కమ్మపాలెంలో తాను పార్టీ కార్యాలయం ఏర్పాటుకు వెళితే దారుణంగా తనను అగౌరవపరిచారని, ఇది ప్రజలందరికీ తెలుసన్నారు. కనీసం కమ్మపాలెంలోకి కూడా రానీయకుండా అడ్డుకున్నారన్నారు. అయినా తాను 5 సంవత్సరాలలో ఎక్కడా కూడా ఏ ఒక్క కమ్మవారిపై తాను కక్ష చూపించిన దాఖలాలు లేవన్నారు. మరో వైపు సాయం కోరి తన వద్దకు వచ్చిన వారికి సాయం చేసిన చరిత్ర తనదన్నారు. కానీ నేడు దామచర్ల జనార్దన్ మాత్రం నీతివంతమైన ఎన్నికల ప్రచారం చేయలేక ఇష్టం వచ్చినట్లు అరాచకం సృష్టిస్తున్నాడన్నారు. సుజాతనగర్‌లో కమ్మ సామాజిక వర్గం ప్రజలు ఎక్కువమంది ఉంటారని, అయినా అక్కడ ఎటువంటి సమస్య రాలేదన్నారు. కేవలం ఈ రోజు ఒక అపార్టుమెంట్ వేదికగా, ముందస్తుగా వీడియోలు తీస్తూ, అక్కడనుంచి మౌనంగా వెళ్లిన వారిపైన సైతం రెచ్చగొట్టి మరీ వివాదం సృష్టించడం వెనుక పక్కా ప్లాన్ ఉందన్నారు. జనార్దన్ కాలు పెట్టిన ప్రతిచోటును కమ్మపాలెంలా మార్చాలని, వారు తప్ప మిగిలిన సామాజిక వర్గాలను భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరిస్తున్నారని, ఇది సరికాదన్నారు. దౌర్జన్యాలు చేస్తుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి శచీదేవి, కోడలు శ్రీకావ్య పాల్గొన్నారు.

మాలలు, మాదిగలు రెండు కళ్లు





మాదిగల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

- మాజీ మంత్రి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సిటీ: నీవు మాల.. నువ్వు మాదిగ అని ఎప్పుడూ పట్టించుకోనని, నాకు మాలలు, మాదిగలు రెండు కళ్లు అని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒంగోలులోని బచ్చల బాలయ్య కళ్యాణ మండపంలో మంగళవారం మాదిగల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. కార్యక్రమానికి ఒంగోలు అర్బన్ మండల అధ్యక్షుడు రాయపాటి అంకయ్య, నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు పసుమర్తి గోపిచంద్ అధ్యక్షత వహించారు. మాదిగలకు వాసన్న ఏం చేశారని దామచర్ల జనార్దన్ పక్కన ఉండే నలుగురు అనుకుంటున్నారని, వైఎస్సార్‌సీపీ నాయకురాలు సువర్ణ వాసన్న దృష్టి తీసుకెళ్లారు. అనంతరం ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దామచర్ల జనార్దన్‌కు అబద్దాలు చెప్పటం అలవాటైపోయిందని విమర్శించారు. ఇళ్ల పట్టాలు ఇస్తే దొంగ పట్టాలు అనడం తగదన్నారు. జనార్దన్ పక్కన ఉండే నలుగురిని అడుగుతున్నా ఒంగోలు పార్లమెంట్‌లో 2 అసెంబ్లీ స్థానాలు మాదిగలకు ఇచ్చాం, కాకుమాను రాజశేఖర్, కె.కనకారావు మాదిగ ఇద్దరికీ రెండు కార్పొరేషన్లకు చైర్మన్లు ఇచ్చామన్నారు. నాయకులను బట్టి చూశారే కానీ కులం బట్టి చూడలేదన్నారు. ఉమ్మడి జిల్లాలో ఒకటి మాలలకు, ఒకటి మాదిగలకు ఎమ్మెల్యే సీట్లు ఇచ్చారన్నారు. గతంలో బాపట్ల ఎంపీ నందిగం సురేష్ కు ఇచ్చామని, ప్రస్తుతం కూడా ఇచ్చామన్నారు. ఎక్కడ లోటు చేశాము.. మాట్లాడడానికి సిగ్గుండాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నా ఎస్సీలు అని అంటున్నారే కానీ నా మాల, నా మాదిగ అని అనటం లేదన్నారు. మొదటిసారి మంత్రివర్గంలో హోం మినిస్టర్‌గా మాలకు సుచరితకు ఇచ్చారని, తర్వాత మాదిగ తానేటి వనితకు ఇచ్చి ఇద్దరినీ సమానంగా జగన్‌మోహన్‌రెడ్డి చూస్తున్నారన్నారు. కేవలం రాజకీయం కోసం, రెచ్చగొట్టేలా వ్యవహరించే అలవాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేదన్నారు. వర్గీకరణ చేయాల్సింది కేంద్రమేనన్నారు. గతంలో చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ చేస్తానని చెప్పి మభ్యపెట్టారని చెప్పారు. చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ చేయాలంటే బీజేపీ చంద్రబాబు చేతుల్లో ఉందన్నారు. చంద్రబాబు పక్కకు జరిగితే బీజేపీ పడిపోతుందన్నారు. చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎందుకు అడ్డం తిరగలేదని ప్రశ్నించారు. టీడీపీకి ఐదు సంవత్సరాలు మాదిగలు కనబడరు, ఎన్నికలప్పుడు మాత్రమే గుర్తుకొస్తారన్నారు. మీకు ఇళ్ల పట్టాలు రాకపోతే పెట్టుకోండి ఇళ్ల పట్టాలతో పాటు ఇళ్లు కూడా కట్టించి ఇస్తానన్నారు. మీ అందరి ఆశీస్సులతో గెలిపించి సిక్సర్ కొట్టిస్తే మీ రుణం తీర్చుకుంటానన్నారు. మీరందరూ నా కుటుంబం, మీకు నావంతు సహాయ సహకారాలు అందిస్తానని, ఎవ్వరినీ ఇబ్బంది పెట్టలేదన్నారు.

లిడ్‌క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ముద్దుబిడ్డ మన బాలినేని శ్రీనివాసరెడ్డి అని కొనియాడారు. బాలినేని శ్రీనివాసరెడ్డి మద్దతు విషయంలో ముందుంటామని, ప్రతి విషయంలో ముందుండి నడిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కూటమికి మద్దతు ఇస్తున్నామా అని అడుగగా లేదు.. లేదు.. అని మాదిగలు నినాదాలు చేశారు. మందా కృష్ణమాదిగ గత ఎన్నికల్లో నోటాకి వేయమన్నారని తెలిపారు. మాదిగ జాతిని వర్గీకరణ పేరుతో మందా కృష్ణమాదిగ తాకట్టు పెట్టి ప్యాకేజీలు పొందుతున్నారన్నారు. కూటమి పేరుతో వీరందరూ కలిసి జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించాలనే కుట్రతో ఉన్నారన్నారు.

మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ సామాజిక న్యాయానికి, సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. చంద్రబాబు కుటిల రాజకీయ నాయకుడని విమర్శించారు. మాల, మాదిగలందరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడాలన్నారు. రాబోయే ఎన్నికల్లో వాసన్న గెలవాలి నేను సైతం సిద్ధం అంటూ సైనికుల్లాగా పనిచేయాలన్నారు.

కార్యక్రమంలో ఒంగోలు మహిళా నగర అధ్యక్షురాలు చింతగుంట్ల సువర్ణ, 11వ డివిజన్ కార్పొరేటర్ గంగవరపు ప్రవీణ్‌కుమార్, నాయకులు పత్రా బంగారం, కొమ్ము సామ్యేలు, జి.సామ్యేలు, జి.రాజారావు, ఈ. రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపటి నుంచి ఓపెన్ ఇంటర్ మూల్యాంకనం

ఒంగోలు: ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకనం గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా చైర్మన్, కోఆర్డినేటర్లు డి.సుభద్ర, బి.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సెయింట్ థెరిసా పాఠశాల ఆవరణలో మూల్యాంకనం 16వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఉదయం సెషన్ 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం సెషన్ 2 నుంచి 5 గంటల వరకు ఉంటుందని వివరించారు. జిల్లాకు మొత్తం 24,912 జవాబు పత్రాలు వచ్చాయని, వాటిని మూల్యాంకనం చేసేందుకు 25 మంది చీఫ్ ఎగ్జామినర్లను, 125 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లను నియమించినట్లు తెలిపారు.

పొగాకు అత్యధిక ధర కేజీ రూ.238



వేలం నిర్వహిస్తున్న సునీల్ కుమార్

కొండపి(మర్రిపూడి): ఒంగోలు రీజియన్ పరిధిలో ఇప్పటి వరకు నిర్వహించిన పొగాకు వేలంలో అత్యధిక ధర బుధవారం కొండపి వేలం కేంద్రంలో నమోదైంది. ఇక్కడి వేలం కేంద్రానికి ధర్మవరం, కోయవారిపాలెం, వెంకటకృష్ణాపురం, ముక్కోడిపాలెం, తాటాకులపాలెం గ్రామాల రైతులు 898 బేళ్లు తీసుకురాగా 682 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర రూ.238, కనిష్ట ధర రూ.220, సరాసరి ధర రూ.229.91 పలికిందని నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ వెల్లడించారు.

విద్యుదాఘాతంతో 13 పొట్టేళ్లు మృతి



మృతి చెందిన పొట్టేళ్లు

అర్ధవీడు(కంభం): ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి 13 పొట్టేళ్లు మృతి చెందిన సంఘటన బుధవారం గిద్దలూరు మండలంలోని కాకర్ల గ్రామ పంట పొలాల్లో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ పీరా 20 గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. పంట పొలాల్లో తెగిపడిన 11 కేవీ విద్యుత్ తీగలను మేత మేస్తున్న మందలో 13 పొట్టేళ్లు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు పీరా ఆవేదన వ్యక్తం చేశారు.

2.2 కేజీల గంజాయి స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సెబ్ అధికారులు

చీమకుర్తి: ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తుండగా సెబ్ అధికారులు దాడి చేసి 2.260 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. బుధవారం స్థానిక సెబ్ పోలీస్ స్టేషన్‌లో సీఐ మారయ్యబాబుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. ఒడిశాకు చెందిన యధిష్టర్ అనే వ్యక్తి నుంచి గత 8 నెలలుగా చీమకుర్తిలోని సెల్ షాపులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఒంగోలు సమతా నగర్‌లో నివాసం ఉంటున్న పశ్చిమ్ బంగ రాష్ట్రానికి చెందిన గోలం ముండల్‌తో పరిచయం ఏర్పడింది. యధిష్టర్ ఒడిశా నుంచి 2.260 కేజీల గంజాయిని రైల్లో తెప్పించినట్లు సెబ్ పోలీసులకు సమాచారం అందింది. ముండల్‌కు బుధవారం ఉదయం 9 గంటల సమయంలో గంజాయి విక్రయిస్తుండగా సెబ్ పోలీసులు దాడి చేసి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సూపరింటెండెంట్ రవికుమార్ వివరించారు. గంజాయి రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కారుణ్య వర్షిణి రంజాన్

వరాల వసంతం, శుభాల సరోవరం రంజాన్ మాసం ముగిసింది. సర్వమానవళికి కారుణ్యవర్షిణి అయిన రంజాన్ మాసం వేనవేల దైవానుగ్రహాలను ప్రపంచ మానవులకు పంచి పెట్టి వెనుదిరిగిపోయింది. ఈ మేరకు అన్ని మసీదుల్లో బుధవారం సాయంత్రం మగ్‌రీబ్ నమాజ్ తర్వాత నెలవంకను దర్శించుకున్న ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ ముబారక్ తెలుపుకొన్నారు.

- కనిపించిన నెలవంక.. నేడు ఈద్ ఉల్ ఫిత్ర్
- ప్రత్యేక ప్రార్థనలకు జిల్లాలోని ఈద్గాలు, మసీదులు ముస్తాబు

కనిగిరి రూరల్/కంభం:

నెల రోజుల కఠిన ఉపవాస దీక్ష ముగిసిన నేపథ్యంలో గురువారం ఈద్ ఉల్ ఫిత్ర్(రంజాన్) ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలోని సుమారు 2.30 లక్షల మంది ముస్లింలు రంజాన్ పర్వదినానికి సర్వం సిద్ధం చేసుకున్నారు. ఒంగోలు, కనిగిరి, పొదిలి, మార్కాపురం, కంభం, గిద్దలూరు, పామూరు, తర్లుపాడు తదితర ప్రాంతాల్లో రంజాన్ సందడి అధికంగా ఉంది.

రంజాన్ స్ఫూర్తి.. సేవా దీప్తి

రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాస దీక్ష ఆచరించి అల్లాహ్‌ను మెప్పించడానికి విశ్వప్రయత్నాలు చేస్తారు. నెల రోజుల ఉపవాస దీక్షలో తరావీహ్ నమాజ్ చదివి, సన్మార్గంలో నడిచిన ముస్లింలు.. శ్రమకు తగిన ప్రతిఫలాన్ని అల్లాహ్ నుంచి పొందే రోజే రంజాన్. జకాత్, ఫిత్ర్, సదకాల పేరుతో సమాజంలోని అభాగ్యులను ఆదరించడంతోపాటు శాంతి సామరస్యాలను, సంతోషాన్ని పెంపొందింపజేయడమే ‘ఈద్ ఉల్ ఫిత్ర్’ అందిస్తున్న సందేశం. పండగ స్ఫూర్తిని ముస్లింలు గుండెల నిండా నింపుకొని ఈ ఆనందంలో అందరినీ భాగస్వాములను చేసే ప్రయత్నం చేయాలని మత పెద్దలు సూచిస్తున్నారు.



కంభంలో ఈద్గా వద్ద ప్రార్థనలకు ఏర్పాట్లు



కనిగిరిలో ఇఫ్తార్ విందులో ముస్లింలు

ఈద్గా వద్ద ప్రార్థన ప్రవక్త ఆజ్ఞ

ప్రతి ముస్లిం రంజాన్ పండగ రోజున ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థన చేయాలన్నది మహ్మద్ ప్రవక్త ఆజ్ఞ అని మౌలానాలు పేర్కొంటున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఈద్గా (వసతులు) లేని వారు తప్ప మిగిలిన ముస్లింలంతా ఈద్గా వద్దే నమాజ్ చేయాలి. ముస్లింలందరూ నూతన దుస్తులు ధరించి(వారి శక్తి కొలది, శుభ్రమైన దుస్తులు ధరించి) ఒక చోటకు చేరి అక్కడి నుంచి తక్బీర్ చదువుతూ ఈద్గా వద్దకు చేరుకోవాలి. ఈద్గాలో జమాత్ సాత్(అందరు ముస్లింలతో) నమాజ్ చేయడం వల్ల ఎంతో పుణ్యం దక్కుతుందని మౌల్వీలు పేర్కొన్నారు. ఈద్గా నమాజ్‌లో గరీబ్, అమీర్(పేద, ధనిక) అనే తారతమ్యం లేకుండా అందరూ ఒకరి పక్కన మరొకరు వరుసగా నిల్చుని ప్రార్థన చేయడం వల్ల సమాజంలో అందరూ సమానమే అన్న భావనను స్ఫురింపజేస్తుంది.

చెక్ పోస్టుల్లో నిరంతర తనిఖీ

- ఫిర్యాదుల కోసం ప్రత్యేక ఫోన్ నంబర్
- ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్
- ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



స్ట్రాంగ్ రూమ్ భద్రతపై సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనాతో మాట్లాడుతున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

మార్కాపురం/మార్కాపురంటౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 18 చెక్ పోస్టుల్లో నిరంతరం వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మార్కాపురంలోని ఎస్వీకేపీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌ను సబ్ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి ఎస్పీ పరిశీలించారు. ఈవీఎంల భద్రతకు సాయుధ బలగాలను వినియోగించాలని స్థానిక పోలీసులను ఎస్పీ ఆదేశించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయాన్ని ఎస్పీ సందర్శించారు. ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూడాలని డీఎస్పీ, ఇతర పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించేందుకు 91211 02266ను ఏర్పాటు చేశామని, 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. అలాగే డయల్ 112, 100 నంబర్లు, సీ విజిల్ యాప్‌ను కూడా వినియోగించుకోవచ్చని చెప్పారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పాటించాల్సిన జాగ్రత్తలపై జిల్లా ప్రజలకు పోలీస్ అధికారులు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఒకరి ఓటు మరొకరు వేసినా, పోలింగ్ ప్రక్రియకు ఆటంకాలు కలిగించినా, ఈవీఎం, వీవీప్యాట్‌తో పాటు పోలింగ్ మెటీరియల్‌కు ఎలాంటి నష్టం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు, సీఐలు ఆవుల వెంకటేశ్వర్లు, రామానాయక్, ఎస్సైలు అబ్దుల్‌రెహమాన్, వెంకటేశ్వరనాయక్‌లు ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులా.. టీడీపీ కార్యకర్తలా?



టీడీపీ ప్రచారం సభలో అటవీశాఖ ఉద్యోగి జార్జి(వృత్తంలో వ్యక్తి)



కృష్ణకిషోర్ ఫంక్షన్‌లో హాస్టల్ ఉద్యోగి రాగిరి శ్రీనివాసులు(వృత్తంలో వ్యక్తి)

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల సమావేశంలో గడికోట చెక్ పోస్టు వద్ద అటవీశాఖలో ఒప్పంద కార్మికుడిగా పనిచేస్తున్న దారా చార్జీ అనే వ్యక్తి ప్రచార సభ కార్యక్రమంలో పాల్గొన్నాడు. అలాగే ముత్తుముల అశోక్‌రెడ్డి నివాస గృహంలో అతడి సోదరుడు కృష్ణకిషోర్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో మంగళవారం కొమరోలు మండలంలోని ఎస్సీ వసతి గృహంలో విధులు నిర్వహిస్తున్న రాగిరి శ్రీనివాసులు పాల్గొని గుట్టుగా టీడీపీ తరఫున ప్రచారం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. టీడీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నప్పటికీ ఎన్నికల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

బీసీలకు వెన్నుదన్నుగా సీఎం జగన్

- బీసీల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మేరుగు నాగార్జున
- జగన్ చేసిన మేలు చరిత్రలో ఎన్నడూ లేదని బీసీ నేతల అభిప్రాయం
- జగనన్నను మరలా గెలిపిస్తామని ముక్తకంఠంతో నినాదం



మహాత్మ పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, బీసీ నాయకులు

నాగులుప్పలపాడు: సమాజంలో వెనుకబడిన కులాలకు వెన్నుదన్నుగా నిలిచిన నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, రాష్ట్ర మంత్రి మేరుగు నాగార్జున పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఉప్పుగుండూరులో నిర్వహించిన నాగులుప్పలపాడు మండల బీసీల ఆత్మీయ సదస్సులో మంత్రి నాగార్జున ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వెనుకబడిన కులాల నుంచి ప్రతి వర్గాన్ని గుర్తించి, కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన నాయకుడు సీఎం జగన్ అని కొనియాడారు. ఎన్టీఆర్ టీడీపీకి దన్నుగా ఉన్న బీసీలను చంద్రబాబు నిత్యం అవహేళన చేస్తూ, చీత్కరించడం బాధాకరమన్నారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న నాయీ బ్రాహ్మణులను తోకలు కత్తిరిస్తాను అనడం, మత్స్యకారులను నోరెత్తమాకండి అని దూషించడం చూస్తే చంద్రబాబుకు బీసీ కులాలపై ఉన్న చిన్నచూపు బాగా అర్థమవుతుందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఇలాంటి చీత్కారాలు ఎదుర్కొన్న ప్రజలకు వైఎస్ జగన్ ఒక ఆశాకిరణంగా కనిపించారని చెప్పారు. వైఎస్సార్ సీపీ పాలనలో బీసీలకు పెద్దపీట వేసి, మోపిదేవి వెంకటరమణ, పిల్లి సుభాచంద్రబోస్, ఆర్.కృష్ణయ్య, బీదా మస్తాన్ రావు లాంటి నాయకులను మంత్రులు, రాజ్యసభ సభ్యులను చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జగనన్న పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని, అలాంటి పాలనను తిరిగి సాధించుకోవాలంటే ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిగా మరో 30 రోజులపాటు కృషి చేయాలని కోరారు. మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ ఆశయాలు జగనన్నతోనే సాధ్యమని గ్రామ గ్రామాన నినదించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ముందుగా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బీసీ నాయకులతో కలిసి మంత్రి ఘన నివాళులర్పించారు.

కనపర్తి గ్రామానికి చెందిన 15 ఎస్టీ కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరగా వారికి మంత్రి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. తొలుత మంత్రి మేరుగును బీసీ సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు దేవినేని మల్లికార్జునరావు, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారు బాబు, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలమలపు కృష్ణారెడ్డి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ పాలడుగు రాజీవ్, పార్టీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, లిడ్ క్యాప్, శాలివాహన, హౌసింగ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్లు కంచర్ల సుధాకర్, పేరాల చెన్నకేశవులు, కొలకలూరి విజయ్‌కుమార్, మాదాసు రాంబాబు, మద్దిసాని నాగేశ్వరరావు, మోహన్, అక్కి సాంబయ్య, పాదర్తి శివ, గందు హరిబాబు తదితరులు ఉన్నారు.



కనపర్తి ఎస్టీ కుటుంబాలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి

ఓటు వజ్రాయుధం



స్వీప్ ప్రకాశం అక్షరమాల రూపంలో గ్రానైట్ కార్మికుల ప్రదర్శన



కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ గోపాలకృష్ణ

- గ్రానైట్ కార్మికులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించిన కలెక్టర్, జేసీ

చీమకుర్తి: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి కార్మికుడు ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్, సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ ఆర్.గోపాల కృష్ణతో కలిసి రామతీర్థంలోని గ్రానైట్ క్వారీల్లో పనిచేసే వేలాది మంది కార్మికులకు ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవడంపై అవగాహన కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, తమిళనాడు, రాజస్థాన్, బీహార్, కర్నాటక, ఛత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాలకు చెందిన వేలాది మంది కార్మికులకు ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా గ్రానైట్ కార్మికులు వంద అడుగుల పొడవైన జాతీయ జెండాను ప్రదర్శిస్తూ, ‘స్వీప్ ప్రకాశం’ అక్షరమాల రూపంలో ఏర్పడ్డారు. కార్యక్రమంలో మైన్స్ డీడీ బీ.జగన్నాథరావు, స్వీప్ అధికారులు రవి, జ్యోతి, వెంకటేశ్వరరావు, పలు క్వారీల యజమానులు, మేనేజర్లు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన అడవి పంది

- మర్రిపూడి వాసి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శివబసవరాజు



దారుకుమల్లి వెంకటసుబ్బారెడ్డి(ఫైల్)

మర్రిపూడి: పొలాల్లో నుంచి రోడ్డుపైకి వేగంగా దూసుకొచ్చిన అడవి పంది మోటారుసైకిల్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి మృతి చెందారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి మర్రిపూడి మండలంలోని విజయలక్ష్మీపేట సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మండల కేంద్రమైన మర్రిపూడి పడమటి బజారుకు చెందిన దారుకుమల్లి వెంకటసుబ్బారెడ్డి(46) వ్యక్తిగత పని నిమిత్తం మర్రిపూడి నుంచి బైక్‌పై జువ్విగుంట వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో విజయలక్ష్మీపేట సమీపంలో పొలాల నుంచి పరుగుతీస్తూ వచ్చిన అడవి పంది బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో వెంకటసుబ్బారెడ్డి రోడ్డుపై పడి తలకు తీవ్ర గాయాలు కాగా, అడవిపంది అక్కడికక్కడే మృతి చెందింది. అదే మార్గంలో వెళ్తున్న మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి గమనించి తన వాహనంలో ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో మర్రిపూడి చెరువు కట్ట వద్ద 108 వాహనం ఎదురు కావడంతో క్షతగాత్రుడిని పొదిలి వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స సుబ్బారెడ్డి మృతి చెందినట్లు ఎస్సై శివబసవరాజు తెలిపారు. మృతుడి చిన్నకుమారుడు లితిన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

విలపించిన కుమారులు

సుబ్బారెడ్డి భార్య పద్మ పదేళ్ల క్రితం క్యాన్సర్‌తో మృతి చెందారు. అప్పటి నుంచి పొక్లెయిన్ అద్దెకు తిప్పుతూ ఇద్దరు కుమారులను ఉన్నత చదువులు చదివించారు. పెద్దకుమారుడు రేవంత్‌రెడ్డి కెనడాలో ఉద్యోగం చేస్తుండగా చిన్నకుమారుడు లితిన్‌రెడ్డి డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. పండగ పూట ప్రమాదవశాత్తు తండ్రి చనిపోవడంతో కుమారులిద్దరూ తల్లడిల్లిపోయారు.

ఎడ్ల పోటీల్లో సత్తాచాటిన ప్రకాశం జిల్లా ఎడ్లు

గిద్దలూరు రూరల్: మండలంలోని కె.ఎస్.పల్లె గ్రామంలో పోలేరమ్మ తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్లపోటీల్లో ప్రకాశం జిల్లా ఎడ్లు సత్తాచాటి ప్రథమ స్థానంలో నిలిచాయి. బేస్తవారిపేటకు చెందిన వేగనాటి ఓసురారెడ్డి, కొమరోలుకు చెందిన కామూరి రమణారెడ్డి, పామూరుపల్లెకు చెందిన గోపు రమణారెడ్డి ఎడ్లు 3300 అడుగులు లాగి ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచి రూ.25 వేలు, రూ.20 వేలను అందుకున్నాయి. వైఎస్సార్ జిల్లా కలసపాడుకు చెందిన బేతి వెంకటరెడ్డి ఎడ్లు 3234 అడుగులు లాగి మూడో బహుమతి రూ.15 వేలు, నంద్యాల జిల్లా రుద్రవరం గ్రామానికి చెందిన షేక్.ఫకీర్‌బాష ఎడ్లు 2853 అడుగులు లాగి నాల్గవ బహుమతి రూ.10 వేలు, కంభం మండల ఎర్రబాలెంకు చెందిన భూపని ఎల్లయ్య ఎడ్లు 2700 అడుగులు లాగి 5వ బహుమతి రూ.5 వేలను, నంద్యాల జిల్లా బనగానుపల్లె గ్రామానికి చెందిన మండ్ల వెంకటేశ్వర్లు ఎడ్లు 2604 అడుగులు లాగి 6 వ బహుమతి రూ.3 వేలను దక్కించుకున్నాయి. ఈ పోటీలకు మొత్తం 26 కాండ్ల ఎడ్లు పాల్గొన్నాయి. విజేతలకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పూలి రామక్రిష్ణారెడ్డి, గిద్దలూరు నియోజకవర్గం దేవాలయం కమిటీ అధ్యక్షుడు చేరెడ్డి ఎర్రారెడ్డిల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు